# పోటీకి ఫలితం

ఎ.కె.వి. రత్నమాల

'అక్బర్ అనగా ఎవరు? మొఘల్ సామ్రాజ్య చరిత్రలో అతనికి గల స్థానమేమిటో వివరింపుము?' అన్న ప్రశ్నకి హిస్టరీ స్టూడెంట్స్ అరగంటసేపు అనర్గళంగా అవలీలగా సమాధానం చెప్పెయ్యగల్రు.

అణుబాంబు అంటే ఏమిటి? అది ప్రపంచ దేశాల్లో ఏదో ఓ దాన్నెత్తిమీద ఎప్పుడైనా పడిందంటే సంభవించే అనర్థాలేమిటీ అంటే చిన్నా చితకా ముసలీ ముతకా తేడా లేకుండా అందరూ అంతో ఇంతో అవలీలగా అలవోకగా జవాబివ్వగల్రు. కానీ... అంబుజ మనగా ఎవరు? తరచూ ఆమె అలగడానికి కారణాలేమిటి? ఆ తర్వాత చోటుచేసుకునే పరిణామాలెలా ఉంటాయి? అంటే దీనికి మాత్రం ఎవరూ కరెక్ట్ సమాధానం చెప్పలేరు. ఎంచేతంటే అంబుజం అంత ప్రముఖ వ్యక్తి కాదు, ఆపైన దేశానికి ప్రధానమంత్రీ కాదు.

అంబుజం అంటే అల్లాటప్పా వ్యక్తికాదు. ఆమె అలిగిందీ అంటే అది ఆషామాషీ విషయం అంతకంటే కాదు. కల్లు ఫుల్లుగా తాగి, నిప్పుతొక్కి తేలుచేత కుట్టించుకుని, దెయ్యాన్ని పట్టించుకున్న కోతి చెరిచే వనం ఎలా ఉంటుందో అంబుజానికి కోపం వచ్చినప్పుడు కొంప అలా ఉంటుంది.

అందుకే అంబుజం మొగుడు ఆంజనేయులికి అక్బర్ గొప్పతనం గురించీ అణుబాంబు పవర్ గురించీ అంతగా తెలీదుగానీ అంబుజం గురించి మాత్రం కూలంకషంగా తెలుసు. అందుకే అతను సాధారణంగా ఆమెకి కోపం రానివ్వడు. అసలా మాటకొస్తే అంబుజానికి అస్తమానూ కోపం రానేరాదు... ఇరుగు పొరుగు వాళ్ళూ ఎదురింటి వాళ్ళూ ఏవైనా కొత్త వస్తువులు కొనుక్కుంటే తప్ప.

ఆ నిజం ఆంజనేయులికి డైరెక్ట్‌గా తెలీదు. డాక్టర్ చెబితే తెలిసింది. ఎలాగంటే.. అంబుజానికీ ఆంజనేయులికీ కొత్తగా పెళ్ళయిన రోజులవి. ఓరోజు... పెళ్ళాం కాస్తంత డల్‌గా కనిపించింది కానీ ఆఫీస్ కెళ్ళే హడావిడిలో ఆంజనేయులు దాన్నంతగా పట్టించుకోలేదు. ఆ మర్నాడు అంబుజం కాస్తంత నీరసంగా కూడా కనిపించింది.

'ఆ! ఏదో మామూలు నలతే అయ్యుంటుంది' అనుకున్నాడే తప్ప అప్పుడు కూడా అతను దాన్నంత సీరియస్‌గా తీసుకోలేదు.

కానీ మూడోరోజుకల్లా వినాయక చవితి ఉండ్రంలా ఉండే అంబుజం కాస్తా పూర్ణం పెట్టని కజ్జికాయలా చిక్కిపోయేసరికి అప్పుడు ఆంజనేయులికి డౌటొచ్చింది. ఆపైన ఆరోజు ఆమె మంచం దిగలేదు కూడా! పెళ్ళాం మంచం పట్టేసరికి ఆంజనేయులికి ఖంగారొచ్చింది. వెంటనే ఆఫీస్‌కి శలవు పడేసి డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళాడు. అంబుజాన్ని ఎన్ని రకాలుగా పరీక్షించినా ఆమెకిగల వ్యాధేమిటో డాక్టర్‌కి అంతుపట్టలేదు.

''ఎన్ని రోజుల్నుంచీ ఉంటోందిలా?'' అడిగాడు మళ్ళీ. ''దాదాపు మూడు రోజుల్నుంచీ'' ఆందోళనగా చెప్పాడు ఆంజనేయులు.


అంబుజం మాత్రం అసలు పెదవి కదపలేదు.

''మీరు బైట కూర్చోండి'' మరోసారి అంబుజాన్ని పరీక్షించడానికి ఉద్యుక్తుడవుతూ, ఆంజనేయులుతో చెప్పాడు డాక్టర్.

ఆ మాటతో అతను బయటకి వచ్చేశాడు. ఆ తర్వాత డాక్టర్ అంబుజాన్ని ఒకే ఒక్క ప్రశ్న వేశాడు. దానికామె ఆయనూహించిన సమాధానమే ఇవ్వడంతో డాక్టర్ తృప్తిగా నిట్టూర్చి ఆంజనేయుల్ని పిల్చి చెప్పాడు. ''మీ భార్య ఉత్సాహంగా హుషారుగా ఉండాలంటే మీ ఇరుగుపొరుగు వాళ్ళు ఏమేం కొనుక్కుంటున్నారో మీరు అవన్నీ ఈమెక్కూడా కొనివ్వండి. సరిపోతుంది. ఇక ఈవిడకి వేరే మందులేం అవసరంలేదు'' అన్నాడు.

ఆ మాటవిని ఆంజనేయులు అవాక్కయిపోతే అంబుజం మాత్రం తెగ ఆనందించేసింది. అది లగాయతూ ఆంజనేయులు అంబుజాన్ని చాలా జాగ్రత్తగా చూసుకోవడం ప్రారంభించాడు.

ఎప్పుడైనా అంబుజం మంచం ఎక్కిందంటే ఆఫీసుకి ఎగనామం పెట్టిమరీ ఆమెని అన్ని కోణాల్లోంచీ అబ్జర్వ్



చేసేవాడు. అనారోగ్యం అయితే అంబుజం కదలకుండా మెదలకుండా మంచంమీద కళ్ళు మూసుకుని పడుకుంటుంది. అదే అలకయితే కళ్ళు బార్లా తెరుచుకుని ఇటే చూస్తూ పడుకుంటుంది. ఆంజనేయులు రాగానే అతనివైపో చూపు విసిరి ఇటునుంచీ అటు తిరిగి అప్పుడు కళ్ళు మూసుకుని పడుకుంటుంది.

ఆమెది అనారోగ్యం పడకయితే డాక్టర్ దగ్గరకి తీసుకెళతాడు. అలక పడకయితే మాత్రం చుట్టుపక్కల ఇళ్ళన్నీ నిశితంగా పరిశీలించి పరిశోధించి పరీక్షించి ఎవరింట్లో ఏ కొత్త వస్తువు ప్రత్యక్షమైందో చూసి సాయంత్రానికల్లా తల తాకట్టు పెట్టయినా సరే దాన్ని కొని తెచ్చి ఇంట్లో పెడతాడు.

అలా పెడుతూ పెడుతూ... భయపడుతూ పడుతూ... అతను భార్యతో ఒకటే మాటంటాడు... ''అలా అస్తమానూ అలగకూడదే- అంబుజం. అలక అనర్థాలకి హేతువు. అతి అన్నిటా పనికిరాదు. తన కోపమే తన శత్రువు. పోటీ అనేది మనిషిలో ఉండచ్చు కానీ మరీ ఇంత విపరీతంగా ఉండకూడదు...'' అని!

కానీ అవన్నీ అంబుజం పట్టించుకుంటేగా! అవిధంగా- అంబుజం అలక ధర్మమాని ఏళ్ళు గడిచేకొద్దీ ఏభై ఎకరాల భూస్వామి అయిన ఆంజనేయులు ప్రస్తుతం పదెకరాల భూస్వామిగా మిగిలాడు.

అలా.. పొలాలన్నీ కర్పూరంలా కరిగిపోతున్న సందర్భంలో అతను చాలాసార్లే అభిప్రాయపడ్డాడు. కొందరు మగాళ్ళు తమ ఆస్తిపాస్తుల్ని నిలువునా తెగనమ్ముకోవడానికి కారణం ఆడాళ్ళూ, వాళ్ళ పోటీ మనస్తత్వమే కారణమని. కానీ ఆమాటని పైకి అనే దమ్ము అతనికి లేదు.

అలా సరదాగా సాదాసీదాగా నెలరోజులు కాలగర్భంలో కలిసిపోయాయి. ఆరోజు ఆంజనేయులు ఆఫీస్‌కెళ్ళే హడావిడిలో ఉండగానే- అంబుజం మంచం ఎక్కింది. పైగా ఆంజనేయులు తనవైపు చూడగానే ఇటునుంచీ అటు తిరిగి కళ్ళు గట్టిగా మూసుకుంది కూడా! ఈసారి- ఆంజనేయులు గుండె గుభిల్లుమంది. భార్య కోపం సంగతి అటుంచి గబగబా ఆఫీస్‌కి చేరుకున్నాడు. అతనక్కడికి వెళ్ళగానే తెలిసిన విషయం ఏమిటంటే.. ఆంజనేయులు వాళ్ళ పైపోర్షన్‌లో ఉంటున్న పార్వతీశం రెండో పెళ్ళి చేసుకుని మరో అమ్మాయిని తీసుకొచ్చాడనీ, అందుకని ఆ పూట అతను లీవ్‌లో ఉన్నాడనీను. ఈసారి అంబుజం అలకకి కారణం అర్థమైపోయింది ఆంజనేయులికి. వెంటనే డ్యూటీకి లీవ్ పడేసి బయల్దేరాడు. అలా వెళ్ళినవాడు ఆ సాయంత్రానికే ఇంటికి చేరాడు. మామూలుగా కాదు.. ఒంటరిగా అసలేకాదు!

జంటగా.. పక్కన అమ్మాయితో.. మెళ్ళో పూలదండల్తో... పసుపుబట్టల్తో నిలబడ్డ ఆంజనేయుల్ని చూసేసరికి అంబుజం గుండె గుభిల్లుమంది. అతన్నలా చూస్తూనే ఘొల్లుమంది.

''ఏమిటండీ ఈపని?... మీరీ వయసులో నాకింత అన్యాయం చేస్తారని కలలో కూడా అనుకోలేదు..'' అంటూ రాగాలు తీసింది. అంబుజం ఏడుస్తుంటే ఆంజనేయులికి జాలేసింది.

''అదికాదే పిచ్చిమొహమా! పైపోర్షన్‌లో పార్వతీశం పెళ్ళానికి సవతి వచ్చింది కదా! ఎలాగూ నువ్వు కూడా తెమ్మంటావనే ఉద్దేశంతో నువ్వు చెప్పకుండానే కాస్త ముందుగా నీ మనసులోని విషయం గ్రహించి తీసుకొచ్చేశాను. అంతే! మరేమీ లేదు. ఊరుకో! ఏడవకు.'' అంటూ భార్యని ఓదార్చాడు ఆంజనేయులు.

అయినా అంబుజం ఆగలేదు. చెయ్యెత్తి కళ్ళు తుడుచుకుంటుంటే... అలిగి సాధించుకున్న ఆమె చేతి రాళ్ళగాజులు మిలమిలా మెరిశాయి. పైట కొంగుతో ముక్కు తుడుచుకుంటూంటే పక్కింటావిడతో పోటీపడి కొనుక్కున్న పట్టుచీర పెరపెర లాడింది.

ఏడుస్తున్న అంబుజాన్ని ఆమెని ఓదార్చుతున్న ఆంజనేయుల్నీ అక్కడే వదిలేసి పెట్టెతో సహా లోపలికి నడిచింది అంబుజం సవతి. నిజమే! అతి అనర్థదాయకమే కాదు... అనారోగ్యకరమైందీ.. అనవసరమైందీ అయిన పోటీవల్ల మనిషికి ఎప్పటికయినా ముప్పు తప్పదు. కదా!

★